హైదరాబాద్ వార్త



# మూడు నెలల్లోగా స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేయాలి

## -వీఎస్టీ నుండి ఇందిరాపార్కు వరకు నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జ్ పనులను మంత్రి కెటిఆర్ ఆకస్మిక తనిఖీ



స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణ పనులను అడిగి తెలుసుకుంటున్న కేటీఆర్

**ధర్నాచౌక్, చిక్కడపల్లి మార్చి 4, ప్రభాతవార్త:** వీఎస్టీ నుండి ఇందిరాపార్కు వరకు నిర్మాణంలో ఉన్న స్టీల్ బ్రిడ్జ్ పనులను మూడు నెలలలోగా పూర్తి చేయాలని పురపాలక, ఐటీ శాఖా మంత్రి కేటీఆర్ అధికారులను ఆదేశించారు. స్టీల్ బ్రిడ్జ్ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో శనివారం ఆయన ఆకస్మికంగా పనులను తనిఖీ చేసి, స్టీల్ బ్రిడ్జ్ పురోగతిని జీహెచ్ఎంసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం ఆలస్యంగా జరుగుతోందని అసహనం వ్యక్తం చేశారు. అవసరమైతే అదనపు బృందాలను ఏర్పాటు చేసుకుని అయినా మే చివరి నాటికి బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలని, ప్రజా ప్రతినిధులు సహకారం తీసుకో వాలని, అవసరమైతే ట్రాఫిక్ మళ్లింపులో ట్రాఫిక్ పోలీసు విభాగంతో సమ న్వయం చేసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కార్మికులకు కానీ, నగర పౌరులకు కానీ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

### నాలా ప్రహరీగోడ గోడ నిర్మాణపనులను పరిశీలించిన మంత్రి

స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణంతో పాటు ఎస్ఎన్‌డిపిలో భాగంగా అశోక్‌నగర్ వద్ద కొనసాగుతున్న నాలా ప్రహరీ గోడ నిర్మాణ పనుల ను మంత్రి కేటీఆర్ సమీక్షించారు. వర్షాకాలం ప్రారంభం నాటికి ఈ పనులన్నీ పూర్తి అయ్యేలా స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వేగంగా ముందుకు పోవాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనాయకులు ముఠా జైసింహ, జీహెచ్ఎంసీ జోనల్ కమీషనర్ శ్రీని వాసరెడ్డి, ఈవీడీఎం ప్రకాష్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, అధికారులు దయానంద్, శ్రీధర్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రాకేష్, శ్రీధర్‌రెడ్డి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

# గతంలో కిటకిట.. ఇప్పుడు వెలవెల

★మూగబోయిన వెల్‌నెస్ సెంటర్లు ★మందులు,వైద్యులు,పరీక్షల కొరత ★భారీగా తగ్గిన ఒపి రోగుల సంఖ్య ★వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణపై అసంతృప్తి

**హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త:** వెల్‌నెస్ సెంటర్లు,ఉద్యోగులు,ఫించన్‌దారులు,జర్నలిస్టులకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకం.ఉదయాన్నే అక్కడికి వెలితే పరీక్షలు చేస్తారు. వాటి రిపోర్ట్లను మధ్యాహ్నానికి ఇచ్చేస్తారు.అవసరమైనే ఈసీజీలు,ఎక్స్ రేలు తీస్తారు. అనంతరం డాక్టర్లు పరీక్షించి మందులు ఇస్తారు. ఆమందులు కూడా ప్రభ్వుమే ఉచితంగా ఇస్తుంది. ఒక వేళ బయటడాక్టర్‌కు చూపించుకున్నా ఆయన రాసిన మందులను ఇక్కడ ఉచితంగా అందిస్తారు.

ఇదంతా గతం..ఆరంభం అద్భుతం మొదట కొద్దినెలలపాటు చక్కగా పని చేసిన వెల్‌నెస్ కేంద్రాలకు ఇప్పుడు జబ్బుపట్టింది. ఇప్పుడు అక్కడ పరీక్షలు చేస్తున్నారు. కానీ వాటి రిపోర్టులు రెండు మూడు రోజులకు వస్తున్నాయి. వీటిల్లోని ఫార్మసిల్లో మందుల్లేవ్ బోర్డులు పెంటడం ఒకటే తరువాయి గత కొన్ని నెలలుగా వీటిని ముందుల కొరత పట్టిపీడిస్తుంది. ఇప్పుడు కనీసం షుగర్,బీసీ మందులు కూడా వీటిలో లేవు. దాంతో ఒకప్పుడు కితాబులు అందుకున్న వెల్‌నెస్ సెంటర్లు ఇప్పుడు వెల్‌లెస్ సెంటర్లు గామారాయి. ఇకప్పుడు కిటకిటలాడిని ఈకేంద్రాల్లో ఇప్పుడు రోగులూ తగ్గిపోయారు.



### నిర్ధారణ పరీక్షలు అంతంతే..

వెల్‌నెస్ సెంటర్‌కు వచ్చిన వారికి 40రకాల పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆమేరకు రోగుల నుంచి నమూనాలు సేకరించి ఐపిఎంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపి పరీక్షలు నిర్వహించేంది. రిపోర్టులను ఆన్‌లైన్‌లో జారీ చేసేంది. ప్రస్తుతం కిట్స్ లేకపోవడంతో సాధారణంగా రక్త మూత్ర పరిక్షలు మినహా ఇతర పరీక్షలు చేయడం లేదు. ఎక్స్ రే, ఈసీజీ,అల్ట్రాసౌండ్ యూనిట్లు ఉన్నా..నిపుణులు లేక సేవలు అందించలేని దుస్తితి నెలకొంది. ప్రస్తుతం ఇక్కడ డెంటల్ క్లినిక్ మినహా ఇతర సేవలు అందించడం లేదు. వెల్‌నెస్ సెంటర్లలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఫిజియోథెరఫీ సహా యోగా,యునాని, ఆయుర్వేద, హోమియో విభాగాలు పూర్తిగా మూతపడ్డాయి.

### తీవ్రమైన మందుల కొరత..

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తున్న ఐదు కేంద్రాల్లోనూ మందులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. కొన్ని నెలలుగా ఈసమస్య ఉన్నా.. వైద్యఆరోగ్యశాఖ పట్టించుకోవడం లేదు. ఇక రక్త,మూత్ర నమూనాలు ఈరోజు ఇసేత వాటి ఫలితాలు రెండు మూడు రోజులకు గానీ ఇవ్వడం లేదు. హైదరాబాద్‌లో అయితే.. వెల్‌నెస్ కేంద్రాల శాంపిల్స్ ను టీడయా గ్నోస్టిక్ సెంటర్లకు పంపుతున్నారు. మరు సటి రోజుకానీ రోగులకు రిపోర్టు అందడం లేదు. అత్యవసరంగా అదేరోజు రిపోర్టు కావాలంటే బయటకు వెళ్లాల్సిందే. ఖైరతాబాద్,వనస్థలిపురం కేంద్రాలకు గతంత లో రోజుకు 600మంది వరకు ఓపీవచ్చేవారు ఇప్పుడా సంఖ్య తగ్గిపోయింది. కొన్ని చోట్ల ఫార్మసీ ఉద్యోగులు దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఎక్కడా స్పెషాలిటీ వైద్యులు లేరు. అలాగే వెల్‌నెస్ కే ంద్రాల బాధ్యతను అక్కడ పనిచేసే వైద్యులకు అప్పగించారు. వాళ్లు ఇటురోగులు, అటు వెల్‌నెస్ సెంటర్లు, మరోవైపు పాలనాపరమైన అంశాలను చూడాల్సి వస్తోంది. ఈహెచ్ ఎస్, జేహెచ్ఎస్ పథకాలపై ప్రభుత్వం పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. దీంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రోగుల అవసరానికి భిన్నంగా మందులు,డిస్పోజల్స్ కొనుగోలు చేస్తున్నారు. కొంతమంది అధి కారులు ఫార్మా కంపెనీలతో కుమ్మక్కై అవసరం లేని మందులు, డిస్పోజల్స్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కేన్సర్, గుండే,కిడ్నీ, కాలేయ సంభందిత సమస్యలతో బాదపడుతున్న రోగులకు కనీస మందులు దొరకడం లేదు. ఇక్కడికి వచ్చే వారికి ఐరన్, విటమిన్, పారాసిట్‌మాల్, బిపీ,షుగర్, మాత్రలు మినహా ఇతర మందులు దొరకనిపరిస్థితి నెలకొంది.

# ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

## అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి

## జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత

**హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి సూర్యలత సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వాహణ ఏర్పాట్లపై తనఛాంబర్‌లో జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షలు జిల్లాల్లో మొత్తం 233 కేంద్రాలలో జరుగనున్నాయని ,జిల్లాలో సుమారు 1లక్ష 71వేల 146మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. ఈపరీక్షలు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.00గంట వరకు మధ్యాహ్నం 2.గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని,పరీక్షా కేంద్రాలల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులందరూ సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా స్పెషల్ బస్సులను నడపాలని ఆర్టీసి అధికారులకు సూచించారు. ముఖ్యంగా విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాలకు క్యాలిక్యులేటర్లు ,సెల్‌ఫోన్‌లు, పెన్‌డ్రైవ్‌లు, ఎలక్ట్రానిక్ వాచీలు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదన్నారు. పరీక్షా కేంద్రాల పరిధిలో జిరాక్సు షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించాలన్నారు. ఈసమావేశంలో డిసిపి బాబురావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వడ్డెన్న, జిల్లా విద్యాశాఖ నుంచి శ్రీనివాస్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ సుద, జిహెచ్ఎంసి పద్మజా తదితరులు పాల్గొన్నారు.



వివిధశాఖల అధికారులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారి సూర్యలత

# నేడు ఎల్బీస్టేడియంలో సానియా మీర్జా ఫేర్‌వెల్ మ్యాచ్



సానియా మీర్జా

**హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త** టెన్నిస్ స్టార్ సానియా మీర్జా ఫేర్ వెల్ మ్యాచ్ ఎల్బీస్టేడియంలో జరగనుంది. ఆదివారం ఉదయం 10 గంటలకు ఈ మ్యాచ్ జరగనుంది. టెన్నిస్‌కు ఇప్పటికే సానియా మీర్జా రిటైర్మెంట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో తన కెరీర్‌లో చివరి మ్యాచ్ హైదరాబాద్‌లో ఆడాలని భావించింది. సొంత గడ్డపై ఫేర్ వెల్ మ్యాచ్ ఆడనుండటం సంతోషంగా ఉందని సానియా మీర్జా తెలిపింది. నగరంతో తనకు ఎంతో అనుబంధం ఉందని చెప్పింది. రిటైర్మెంట్ తర్వాత ఫ్యామిలీకి అధిక సమయం కేటాయిస్తానని చెప్పుకొచ్చింది. అటు హోమ్ టౌన్‌లో అభిమానుల కోసం ఆడబోతున్న ఈ మ్యాచ్‌కు ఫుల్ క్రేక్ ఏర్పడింది.

# కర్నాటక సాహిత్య మందిర్‌కు రూ.5కోట్లు కేటాయించడం హర్షణీయం

## -అధ్యక్షులు సురేందర్ ఖడ్గరే



సాహిత్య మందిర్ వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ప్రతినిధులు

**హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త:** కర్ణాటక సాహిత్య మందిర్ పున:నిర్మాణానికి సిఎం కెసిఆర్ ఐదుకోట్లు కేటాయించడం హర్షణీయమని రాష్ట్రంలోని కన్నడీయులు అంతా సిఎం కెసిఆర్‌కు ఎంతో రుణపడి ఉన్నారని కర్ణాటక సాహిత్య మందిర్ అధ్యక్షుడు సురేందర్ ఖడ్గారే కార్యదర్శి నర్సింహామూర్తిలు తెలిపారు. శనివారం బర్కత్‌పురాలోని కర్ణాటక సాహిత్య మందిరం ప్రాంగణంలో సిఎం కెసిఆర్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్ణాటక సాహిత్యమందిర్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఇచ్చిన హామీని నెరవేర్చారని అందుకు తమ పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో సాహిత్య మందిర్ ఉపాధ్యక్షులు బల్లాల్, రాఘవేందర్ దేశాయ్, నాయకులుపరిమళ్ రావు, ముకుంద్ కులకర్ణి, సురేందర్ కులకర్ణి , జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, డివిజన్ ఇంచార్జ్ బద్దుల శిరీష ఓంప్రకాశ్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు ఎర్ర భీష్మ దేవ్, ప్రధాన కార్యదర్శి సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

# చదువు ఇష్టం లేదంటూ విద్యార్థి ఆత్మహత్య..

**మూసాపేట, మార్చి 04, ప్రభాతవార్త** చదవుకోవడం ఇష్టంలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలానగర్ పోలీస్ స్టేషన్ సిఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం వినాయకనగర్‌కు చెందిన శివప్రసాద్ (19) బీటెక్ చదువుతున్నాడు. సరిగ్గా చదువుకోకపోతుండడంతో తల్లిదండ్రులు తరచూ మందలిస్తూవచ్చారు. చదవు విషయంలో తనకు ఏమాత్రం ఆసక్తిలేదని చెప్తున్నా తల్లిదండ్రులు చదువుకోమని చెప్పడంతో అతనికి నచ్చలేదు. కాగ శుక్రవారం తండ్రి పనిమీద ఊరెళ్ళాడు. తల్లి, చెల్లి బయట కూర్చున్నారు. అదే సమయంలో బయటి నుంచి వచ్చిన శివప్రసాద్ బెడ్రూంలోకి వెళ్ళి తలుపు వేసుకుని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి గదిలో సూసైడ్‌నోట్, అతడి సెల్‌ఫోన్‌ను స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. 50 లక్షలు వసూలు ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**మలక్‌పేట, మార్చి 4 ప్రభాతవార్త:** వివిధ కంపెనీలలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద రూ. 50 నుండి 60 లక్షలు వసూలు చేసి మోసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కస్పరాజు శ్రీనివాస్ శనివారం రాత్రి కేసుకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. నెల్లూరుకు చెందిన అవ్వారు మోహన్ (33) ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మల్లె మహేష్ (31)లు దిల్‌సుక్‌నగర్ 2021వ సంవత్సరంలో ఎంఎస్‌ఐటి టెక్నాలజీస్ సంస్థను ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తామని ప్రకటనలు ఇచ్చారు. కాగా బంజారాహిల్స్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ హనీఫ్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. అక్టోబర్ 2022లో అబ్దుల్ హనీఫ్ వారిద్దరినీ సంప్రదించి దిల్‌సుక్‌నగర్‌లోని వారి ఆఫీస్ వద్దకు వచ్చాడు. దీంతో మోహన్, మహేష్‌లు తమ సంస్థలో పేరు నమోదు చేసుకోవడంకోసం రూ. 2.5లక్షలు చెల్లించాలని అబ్దుల్ హనీఫ్‌కు చెప్పడతో వారి మాటలను విశ్వసించి అక్టోబర్ 10న లక్ష నగదు, మరొకరు 1.5 లక్షలను అక్టోబర్ 17వ తేదీన ఆన్‌లైన్ ద్వారా వారికి ఇచ్చాడు. ఐటి శిక్షణకోసం ఆఫర్ లెటర్‌కోసం రూ. 2.5 లక్షలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం ఐటి కంపెనీ ఆఫర్ లెటర్, మరో ఐటి కంపెనీ గుర్తింపు కార్డును బాధితుడికి ఇచ్చారు. కాగా ఐటి కంపెనీ గుర్తింపు కార్డులు నకిలీవని బాధితుడికి తెలిసింది. పలువురి వద్ద సెక్యూరిటీ డిపాజిట్ కింద బ్లాంక్ చెక్కులను మోహన్, మహేష్‌లు తీసుకుని శిక్షణకోసం లాప్‌టాప్‌లను ఇస్తామని చెప్పినప్పటికీ అబ్దుల్ లతీఫ్‌కు ఇచ్చిన లాప్‌టాప్ సరిగా పని చేయకపోవడంతోపాటు పాతది ఇచ్చారు. కొద్దిరోజులు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చి తరువాత శిక్షణ మానివేసారు. దీంతో బాధితుడు తనకు ఇచ్చిన ఆఫర్ లెటర్, గుర్తింపు కార్డులు అన్ని నకిలీవని వెంటనే మలక్‌పేట పోలీస్ స్టేషన్‌లో అబ్దుల్ హనీఫ్ ఫిర్యాదు చేశాడు. అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ విధంగా సుమారు 35 మందినుండి రూ. 50 నుండి రూ. 60లక్షలకు వసూలు చేసి మోసం చేయడం జరిగిందని ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాస్ వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో నలుగురికి గాయాలు

**పేట్‌బషీరాబాద్,మార్చి4 ప్రభాతవార్త:** గాలికి ఎగురుతున్న ప్లెక్సీని సరిచేస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు విద్యుత్ ఘాతానికి గురైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కొంపల్లి సినీప్లానెట్ ఎన్‌సీఎల్ నార్త్ సర్వీస్ రోడ్డులో ఉన్న సాయి చైతన్య జూనియర్ కళాశాల సమీపంలోనే 11కేవీ విద్యుత్ తీగల స్తంభం ఉంది. కళాశాలకు చెందిన ప్లెక్సీ ఊడిపోయి గాలికి ఎగురుతుండడం గమనించిన సిబ్బంది విజయ్, ఉపేందర్, లక్ష్మణ్, కళాశాల భవనంపైన అద్దెకు ఉంటున్న కారు డ్రైవర్ క్రాంతి ప్లెక్సీని సరిచేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా గాలి ఎక్కువ అవడంతో ప్లెక్సీ 11కేవీ విద్యుత్ తీగలకుతాకి ప్లెక్సీని సరిచేస్తున్న నలుగురికి విద్యుత్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలతో బయ టపడగా డ్రైవర్ క్రాంతికి తీవ్ర గాయాలు అయ్యాయి. కళాశాల యాజ మాన్యం వెంటనే స్పందించి బాధితులను సమీపంలోని హర్ష ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.అయితే తీవ్ర గాయాలైన డ్రైవర్ క్రాంతికి వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని కళాశాల డైరెక్టర్ కెవిఎల్ ఎన్‌రెడ్డి తెలిపారు.

# పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని మహిళలు నిరసన



వంట గ్యాస్ ధర పెంపుకు వ్యతిరేకంగా నిరసన చేపడతున్న మహిళలు

**హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శనివారం అంబర్‌పేటలోని తిలక్‌నగర్ చౌరస్తాలో అనేక మందిమహిళలు కట్టెల మోపు ఎత్తుకుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. తెలియజేశారు. సిపిఎం అంబర్‌పేట జోన్ కమిటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.మహేందర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత సామాన్య ప్రజలపై అనేక భారాలు మోపుతున్నదని, ఈశాన్య రాష్ట్రాలలో ఎన్నికలు పూర్తి అవగానే గ్యాస్ ధరను పెంచిందని, 400 రూపాయలు ఉండే గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం 1155 రూపాయలకు చేరుకుతుందన్నారు. ఇప్పటికే పెరిగిన అనేక వస్తువుల ధరలతో సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారని, ఈ తరుణంతో తిరిగి వంట గ్యాస్ ధరను పెంచి మరింత భారం మోపడం సిగ్గు చేటని నిశితంగా విమర్శించారు. ప్రపంచ మార్కెట్‌లో అనేక ధరలు అదుపులో ఉన్నప్పటికి ప్రజల నడ్డి విరిచేలా వంట గ్యాస్ ధరను పెంచారని విమర్శించారు. తక్షణమే వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి. రాములు, బి.సుబ్బారావు, ఎల్.సోమయ్య, మోహన్, వరలక్ష్మి, నాగమ్మ, పర్వతాలు, మంగమ్మ, బీరమ్మ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ పనులు ప్రారంభించండి

**చాంద్రాయణగుట్ట, మార్చి 4 ప్రభాతవార్త,** పాతబస్తీ ఉప్పుగూడ మహంకాళి ఆలయం ప్రాంగణంలో ప్రభుత్వం నిర్మించనున్న మల్టీఫర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మహంకాళి దేవాలయం కమిటీ అధ్యక్షులు జనగామ మధుసూధన్ గౌడ్ శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా మధుసూధన్ గౌడ్ మాట్లాడుతూ ఫంక్షన్ నిర్మాణానికి టెండరు ప్రక్రియ పూర్తి అయిందని సాధ్యమైనంత త్వరగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును ఈ నెల 16వ తేది తరువాత భూమి పూజల చేసి యుద్ధ ప్రాతిపదికన కళ్యాణ మండపం నిర్మించుకుందామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కీర్తి నరేందర్, సతీష్ గౌడ్, భవాని శంకర్, హరికృష్ణ, ఆనంద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆలయ కమిటీ సభ్యులు,

# 8 నుంచి మూడు రోజుల పాటు మంచి నీటి సరఫరాలో అంతరాయం

**హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త** ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మంచినీటి సరఫరా నిలిచిపోనుంది. సిద్ధిపేట జిల్లా కుకునూర్ వద్ద రైల్వే శాఖ నూతనంగా ట్రాక్‌లైన్‌ను నిర్మించ తలపెట్టింది. ఈ రైల్వే లైన్ నిర్మాణానికి అటంకం కలగకుండా నగరానికి మంచినీరు సరఫరా చేస్తున్న గోదావరి తొలి విడత పథకంలో భాగంగా కొండపాక నుంచి ఘన్‌పూర్‌కు ఉన్న 3000 ఎంఎం డయా ఎంఎస్ మెయిన్ పైప్‌లైన్‌ను పక్కకు మార్చాల్సి ఉంది. ఈ నెల 8వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 10వ తేదీ శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఈ పనులు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు. దీంతో 66 గంటల పాటు పలు రిజర్వాయర్ల పరిధిలోని నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు వెల్లడించారు.షాపూర్, చింతల్, జీడిమెట్ల, వాణి కెమికల్స్, జగద్గిరిగుట్ట, గాజుల రామారం, సూరారం, మల్కాజిగిరి, డిఫెన్స్ కాలనీ, నాగారం, దమ్మాయిగూడ, కీసర, బొల్లారం, కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, కొండపాక, ప్రజ్ఞాపూర్, కంటోన్మెంట్ ప్రాంతం, ఎంఈఎస్, తుర్కపల్లి బయోటెక్ పార్కు, కాప్రా మున్సిపాలిటీ పరిధి ప్రాంతాల్లో మూడు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని కోరారు.

## విజయవంతం కొనసాగుతున్న 'కంటి వెలుగు'

**సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో చేపట్టిన 'కంటి వెలుగు' కార్యక్రమం నారాయణగూడలోని విక్రమ్‌నగర్ కమ్యూనిహాల్‌లో విజయవంతంగా కొనసాగుతున్నది. గత నెల 9వ తేదీన ప్రారంభించిన ఈ కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి శనివారం తెలిపారు. ఇప్పటి వరకు 2,910 మంది కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవడం జరిగిందని చెప్పాఉ. వీరిలో 1221 మందికి కంటి అద్దాలను, మందులను ఉచితంగా పంపిణి చేశామని, మరో 684 మందికి కంటి అద్దాల కోసం ఆర్డర్ ఇవ్వడం జరిగిందని, త్వరలో కంటి అద్దాలు రాగానే వారికి పంపిణి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కంటి వెలుగు శిభిరంలో క్యాంప్ డాక్టర్ డాక్టర్ మాధవి, ఆప్టోమెట్రిస్ట్ రాజు, డిఇఓ అమ్రీన్, ఎఎన్‌ఎం సుహాసిని, అషా, మాధవి తదితరులు విశేషమైన సేవలు అందిస్తున్నారని ఆయన చెప్పారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న క్రిష్‌చింతలూరి, మార్త రమేష్, ప్రభాకర్‌రావు తదితరులు

## ఏప్రిల్ 10నుంచి ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ టెస్ట్

హైదరాబాద్, మార్చి 4,ప్రభాతవార్త: ఫౌండేషన్ 6నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 10నుంచి 15వరకు నేషనల్ వైడ్ ఆన్‌లైన్ స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించను నననట్లు ఐకాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు క్రిష్ చింతలూరి తెలిపారు. ఈమేరకు శనివారం జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీలోని కార్యాల యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో "స్కిలియోమా-నేషనల్ ఆన్‌లైన్ మెరిట్ స్కాలర్ షిప్ టెస్ట్ "బ్రోచర్‌ను పి.వి ఫౌండేషన్ చైర్మన్ పి.వి ప్రభాకర్‌రావు, నిమ్స్ లిజనింగ్ ఆఫీసర్ మార్త రమేష్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్కాల ర్‌షిప్ టెస్టుకు అప్లై చేసుకునే వారికి ఏప్రిల్ 1వ తేదీ చివరితేది గా ప్రక టించారు. ఆది పూర్తిగా ఆంగ్లభాష ఆధారంగా నిర్వహిం చబడు తుందని ఈపరీక్షకు దాదాపు 2నుంచి 3లక్షల మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు.ఐకాన్ ఫౌండేషన్, స్కిలి యోమా, రివార్డ్, వెక్స్ సమన్వయంతో ఈ టెస్టు నిర్వహిస్తున్నా మన్నారు. ఈటెస్టు ద్వారా సుమారు 2కోట్లకుపైగా విద్యార్థులకు స్కాల ర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో రేఖరావు, హరప్రసాద్ పాండా, దర్పన్ వాసుదేవ్, ప్రతీ ఉపాధ్యాయ్ టిజేఏఫ్ ప్రెసిడెంట్ తనుగుల జితేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వ్యాక్సిన్ ఆవశ్యకతపై ప్రత్యేక కార్యక్రమం

హైదరాబాద్,మార్చి 4,ప్రభాతవార్త: అంతర్జాతీయ హెచ్‌పివి వ్యాక్సిన్ అవగాహన దినోత్సవం సందర్భంగా హెచ్‌పివి వ్యాక్సిన్ ఆవశ్యకతపై కళాశాల విద్యార్థినులకు ప్రత్యేక క్యాక్రమాన్ని నిర్వహించారు.మియాపూర్ మాతృశ్రీనగర్‌లోని గాలెన్ ఆసుపత్రిలో నిర్వహించిన ఈకార్యక్రమంలో పలుకళాశాలలకు చెందిన విద్యార్థినీలు పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్యుల డా.లాస్య, డా.స్వాతి యలమర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గర్భాశయ క్యాన్సర్ మహిళల్లో 4వ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పేర్కొన వచ్చునని తెలిపారు. హెచ్‌పివి వైరస్ కారణంగా వస్తున్న గర్భాశయ క్యాన్సర్ రాకుండా అరికట్టడానికి ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలు చేసిన కృషి ఫలితంగా హెచ్‌పివి నివారణ వ్యాక్సిన్ ఆవిష్కరించబడిం దన్నారు. డైరెక్టర్ నిరుపమ మాట్లాడుతూ ఇంతటి ప్రాముఖ్యత కలిగిన వ్యాక్సిన్‌ను అందరికీ అందించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొ న్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు డాక్టర్లు ,సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటిని పరిశీలించిన ఎమ్మెల్యే

మెహిదీపట్నం, మార్చి 04, ప్రభాతవార్త : వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండ తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ జలమండలి అధికా రులను ఆదేశించారు. శనివారం హకీంపేట్ యూసూఫ్‌గల్లీలో డిజీఎం జవహర్‌అలీతో కలిసి ఇంటింటికి తిరుగుతూ తక్కువ పీడనంతో వస్తున్న తాగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ మాట్లాడుతూ.. హకీంపేట్‌లో ప్రతి గల్లీలో లక్షలాది నిధులను ఖర్చుచేసి నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటుతో పాటు ఎక్కడ సమస్యలు తలెత్తినా వెనువెంటనే స్పందించి సమస్యలను పరిష్క రించడం జరుగుతుందన్నారు. కలుషిత జలాలను నివారించడంతో పాటు తక్కువ పీడనంతో నీరు సరఫరా కాకుండ తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించాలన్నారు. నిర్లక్ష్యం చేయరాదన్నారు. ప్రతి ఇంటికి తిరుగుతూ తాగునీటిని పరిశీలించడంతో స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఆయన వెంట సీనియర్ మజ్లిస్ నాయకులు, జలమండలి అధికారులు, సిబ్బంది, స్థానికులు ఉన్నారు.

## ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితులందరిని తక్షణమే అరెస్టు చేయాలి

### డిబిపి జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ డిమాండ్

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: ఢిల్లీ లిక్కర్ స్కాంలో భాగస్వాములైన నిందితులందరిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత బహుజన పార్టీ (డిబిపి) కేంద్ర ప్రభుత్వాన్ని, సిబిఐని డిమాండ్ చేసింది. ఇప్పటికే ఢిల్లీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, వివిధ పార్టీల బంధువులను మద్యం సిండికేట్లను అరెస్టు చేసినందున మిగిలిన నిందితులందరిని వెంటనే అరెస్టు చేయడానికి సిబిఐ చర్యలు చేట్టాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్డమూరి కృష్ణస్వరూప్ కోరారు. శనివారం నాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ రాష్ట్రంకు, కేంద్ర ప్రభుత్వానికి రావాల్సిన వేల కోట్ల రూపాయల ఆదాయాన్ని మద్యం సిండికేట్ మాఫియా చర్యలతో గండిపడిందన్నారు. ఢిల్లీ మద్యం స్కాంపై బిఆర్ఎస్, బిజెపి పార్టీలు పరస్పర రాజకీయ ఆరోపణలు, రాజకీయ విమర్శలు చేసుకోవాల్సిన అవసరం లేదని, చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. ఈ స్కాంలో బిఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవితపై వచ్చిన ఆరోపణలను కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఆమెపైన ఉందన్నారు. ఈ స్కాంలో బిఆర్ఎస్, బిజెపి, వైఎస్ఆర్‌సిపి, ఆమ్ ఆద్మీ పార్టీ తదితర రాజకీయ పార్టీల నేతలు, బంధువుల ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు. ఈ స్కాంలో బాధ్యులైన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలే కాని సిబిఐ, ఇడిలను కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం పావులుగా ఉపయోగించుకోరాదని ఆయన హెచ్చరించారు. ఈ మద్యం స్కాంపై పూర్తి స్థాయిలో న్యాయ విచారణ జరిపించడానికి రాష్ట్రపతి, కేంద్ర హోం శాఖ ప్రత్యేకంగా చర్యలు చేపట్టాలని వడ్డమూరి కోరారు.

## ధర తగ్గించేంతవరకు ఉద్యమిస్తాం

### ఎస్.ఛాయాదేవి హెచ్చరిక


హిమాయత్‌నగర్‌లో కట్టెల పొయ్యితో వంటా వార్పు కార్యక్రమాని న్న సిపిఐ మహిళా నేతలు

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వ్యతిరేకిస్తూ సిపిఐ మహిళలు తొలిసారిగా హైదరాబాద్ నగరంలోని హిమాయత్‌నగర్‌లో నడిరోడ్డు మీద కట్టెల పొయ్యితో వంటా వార్పు కార్యక్ర మాన్ని శనివారం చేపట్టారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది మహిళలు ఈ వంటా వార్పు కార్యక్రమంలో వంట గ్యాస్ ధర పెంపుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 ఏళ్ళలో అనేక మార్లు గ్యాస్ ధరను పెంచి మోయలేని భారాన్ని సామాన్య ప్రజలపై మోపి వారి జీవితాలతో చెలగాటమాడుతున్నందని ఆరోపిం చారు. 9 ఏళ్ళ క్రితం 400 రూపాయలు ఉండే గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం 1155 రూపాయలకు పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించేంత వరకు మహిళలు ఉద్యమిస్తారని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ పి.ప్రేమ్‌పావని మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పటికి దేశంలో పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలు మండిపోతున్నాయని ఇందులో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గతంలో 50 రూపాయలు గ్యాస్ ధర పెరిగితే బిజెపి నాయకులు రోడ్లమీదకు వచ్చి ఆందోళనలు చేపట్టారని ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్. ఇ.టి.నర్సింహ, జిల్లా సహాయ కార్యదర్శులు స్టాలిన్, కమతం యాదగిరికార్యవర్గ సభ్యులు పడాల నళిని, శ్రీకాంత్, మల్లేష్, శ్రీనివాస్, చక్రి, రాధిక, జ్యోతి, మన్నన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వంట గ్యాస్ ధర తగ్గించాలని ఆమ్ ఆద్మీ పార్టీ ధర్నా

సైఫాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అనేక మంది ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు శనివారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యుడు బుర్ర రాముగౌడ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఆరోపించారు. 2014లో 410 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ప్రస్తుతం 1155 రూపాయలకు పెరిగిందన్నారు. కమర్షియల్ సిలిండర్ ధరపై 350 రూపాయలకు పెంచడం వల్ల 2345కు చేరుకుందన్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఫర్వీన్‌బేగం, ఆఫ్షాన లాం, జ్యోతి, దర్శనం రమేష్, సయ్యద్ గఫార్, ననాగరాజు, మహమూ ద్‌ఆలీ, అక్షయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు:కార్పోరేటర్


అధికారులతో మాట్లాడుతున్న మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, మార్చి 4 ప్రభాతవార్త: జలమండలి, మున్సిపల్ అధికారులతో కలిసి శనివారం హిమాయత్‌నగర్ డివిజన్ కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్ గౌడ్ డివిజన్‌లో పలు బస్తీలలో రోడ్ల సమస్యలపై సమీక్ష చేపట్టారు. మీనర్వా కాంప్లెక్స్ కేఫ్ పక్కన ఉన్న వీధిలో రోడ్డును రాత్రికి రాత్రే తవ్వడా న్ని గమనించిన ఆమె అధికారులను నిలదీశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత జిహెచ్ఎంసి సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని గుర్తు చేసి ప్రజా ధనం వృదా కాకుండా చూడాలని అధికారలను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జిహెచ్ఎంసి అధికారులు ఈశ్రరాజు, దుర్గా ప్రసాద్, దివ్య, జలమండలి అధికారుల మహేందర్‌రెడ్డి, బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జైస్వాల్, మల్లేష్, ప్రవీణ్, వేణుగోపాల్‌యాదవ్, అనిల్, బిందియా, సుజాత, పూజ తదిటటతరులు పాల్గొన్నారు.

## సమకాలీన పరిశోధనలపై సమగ్ర అవగాహన కల్గిఉండాలి

### ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్

తార్నాక, మార్చి 4 ప్రభాతవార్త: సమకాలీన పరిశోధనలపై సమగ్ర అవగాహన కల్గిఉండాలని ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ పేర్కొన్నారు. జాతీయ మ్యాథమెటిక్స్, సైన్స్ డే సందర్భంగా ఓ.యూ ఇంజనీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రొ.శ్రీరాం వెంకటేష్, ఓ.యూ యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ. జి.మల్లేశం మాట్లాడుతూ విద్యా, పరిశోధ నలు, నూతన సాంకేతికత విషయంలో అప్ డేట్ కావాలని సూచిం చారు. విద్య, పరిశోధనలతో పాటు సమకాలీన సమాజంలో ఎదురౌతున్న సవాళ్లను ఎదుర్కోనేందుకు మానసికంగా విద్యార్థులు సంసిద్దులు కావాలన్నారు. చిన్న చిన్న సమస్యలను పెద్దగా ఊహించుకొని మానసిక ఆందోళనలకు గురికావద్దన్నారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రోత్సాహంతో మ్యాథమెటిక్స్ ఫ్రమ్ అబ్‌స్ట్రాక్ట్ టూ అప్లికేషన్... అప్లయిడ్ ఫిజిక్స్ అనపే థీమ్‌తో ఏర్పాటు చేసిన ఒక్క రోజు జాతీయ కార్యశాలకు డా. సీహెచ్ శ్రీనివాస్ కన్వీనర్‌గా డా.ఎన్.నర్సింహులు గౌడ్ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డా. సి.గోవర్ధన్, డా. ఎన్. నర్సిం హులు, డా. సీహెచ్ శ్రీనివాస్, డా.డి.శ్రీనివాస్, డా. చలమల్ల వెంకటేశ్వర్లు, డా. కృష్ణమూర్తి గౌడ్, డా. అశోక్, డా. స్వర్ణలత, డా. సరిత తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 25 మంది విద్యార్థులు పోస్టర్ ప్రజెంటేషన్స్ అందజేశారు. అందులో ఉత్తమమైన పోస్టర్ ప్రజెంటే షన్స్‌కు సర్టిఫికెట్లను అందజేశారు.



## మింట్ కాంపౌండ్‌లో ఘనంగా అంతర్జాతీయ దినోత్సవం

మింట్ కాంపౌండ్‌లోని ఎలక్ట్రిసిటీ ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిఎస్‌పిడిసిఎల్ ఎండి రఘుమారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.జ్యోతిర్మాయి, ప్రధాన కార్యదర్శి ఎం.తులసినాగమణి తదితరులు హాజరైన చిత్రం

## మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్టు

మూసాపేట, మార్చి 03, ప్రభాతవార్త సీపీ సైబరాబాద్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది సైబరాబా ద్‌లోని ఎస్ఓటి బృందాలతో కలిసి మాదకద్రవ్యాల వ్యాపారులు, వినియోగదారుల కోసం నిరంతరం నిఘా పెట్టి డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాల ముప్పును అరికట్టేం దుకు ఇన్‌ఫార్మర్‌లను ఎన్నుకున్నారు. కాగా శుక్రవారం విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఓటి బాలానగర్ జోన్‌తో పాటు కూకట్‌పల్లి పరిధిలోని వై జంక్షన్ వద్ద జెల్ రూపంలో కలుపు నూనెను విక్రయిస్తున్న నిందితులను ఇద్దరిని అరెస్టు చేశారు. కూకట్‌పల్లి పీఎస్‌లో వీడ్ ఆయిల్‌తో కూడిన 220 చిన్న ప్లాస్టిక్ కంటైనర్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో కంటైనర్‌లో 5 గ్రాముల ఉంటుంది, దాని విలువ 2లక్షల 20వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితులు ఒడిశా రాష్ట్రానికి చెందిన నారా పూజారి (34), మధు హంతల్ (57) ఇద్దరిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి జెల్ రూపంలో కలుపు నూనె 220, చిన్న ప్లాస్టిక్ కంటైనర్లు (ఒకొక్క కంటైనర్‌లో 5 గ్రాముల, 1000 రూపాయలు), మొబైల్ ఫోన్ 1, సుమారు 2,20,000 స్వాధీనం చేసుకున్నారు. డిసిపి బాలానగర్ జోన్, ఏసీపీ కూకట్‌పల్లి డివిజన్ పర్యవేక్షణలో ఎస్ఓటి బాలానగర్ జోన్ బృందంతో కలిసి ఇన్స్‌పెక్టర్ కూకట్‌పల్లి సిబ్బంది నిందితులను పట్టుకోవడంలో అపారమైన కృషి చేసిన వారికి ప్రశంసలు తగిన రివార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. డ్రగ్ సరఫరాదారులు, మాదకద్రవ్యాలకు సంబంధించిన ఏదైనా సమాచారాన్ని డయల్ 100 ద్వారా లేదా సైబరాబాద్ ఎన్‌డిపిఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెల్ నంబర్ 7901105423 లేదా సైబరాబాద్ వాట్సాప్ నంబర్ 9490617444 ద్వారా పౌరులు పోలీసులకు తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అభ్యర్థించారు.

## ఎర్రగడ్డలోఘనంగా మహిళా దినోత్సవం

యూసుఫ్‌గూడ, మార్చి 04, ప్రభాతవార్త అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని ఎర్రగడ్డలో మహిళలకు పెద్ద ఎత్తున ఆటల పోటీలను నిర్వహించారు. వివిధ రకాల ఆటల పోటీలో గెలుపొందిన విజేతలకు జూబ్లీహిల్స్ శాసన సభ్యులు బిఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటిగోపినాథ్ బహుమతులను అందజేశారు. అంతకు ముందు మహిళలను శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఓ స్త్రీ శక్తిగా ఎదగాలని అన్ని రంగాలలో ముందుకు రావాలని మహిళలకు అన్ని విధాల అండగా నిలవాలని తెలంగాణలో అనేక పథకాలు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడలేని విధంగా మహిళల కోసం కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలను తీసుకువచ్చారని మహిళల స్వాలంభన కోసం వారి సాధికారత కోసం కృషిచేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు డి. సంజీవ, ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఖురేషి, పల్లవి యాదవ్, కళ్యాణి, హజీమ్, రసూల్, సుధ, అలైఖ్య, గంటా మల్లేష్, ఎమ్‌డి సర్దార్, బాలకృష్ణ, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి ఆధ్వర్యంలో నిరసన

యూసుఫ్‌గూడ, మార్చి 04, ప్రభాతవార్త బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎక్కడిక్కడే విఫలమ యిందని విమర్శిస్తూ పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్ నియోజకవర్గం బిజేపి నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం వ్యక్తంచేశారు. శనివారం నియోజకవర్గం పరిదిలోని యూసుప్‌గూడ బస్తీ చౌరస్తాలో నియోజకవర్గం కన్వీనర్ కుంబాల గంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నిరసన కార్యక్రమంలో నగర బిజెపి ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్‌తో పాటు సీనియర్ నాయకులు లంకల దీపక్‌రెడ్డి డాక్టర్ పద్మ, డి.ప్రేమ్‌కుమార్‌లు పాల్గొన్నారు.పెద్దఎత్తున రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నినాదాలు చేశారు. మాయ మాటలతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని ప్రతివిషయంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీని తిట్టడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఈసం దర్బంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్దం చేశారు.ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరుగకుండా ఎస్ఆర్‌నగర్, జూబ్లీహిల్స్ పోలీసులు పెద్దఎత్తున బందోబస్తునిర్వహించారు. ఈకార్యక్రమంలో నగర కార్యదర్శి సుప్రియ గౌడ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిది కొలన్ సత్యనారాయణ, అట్లూరి రామకృష్ణ, బంగారు ప్రశాంత్, వెంగళరావునగర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు నందికాశీ విజయ్‌కుమార్, రాజేందర్, గణేష్‌రెడ్డి, పులిరామ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని క్యాండిల్ ర్యాలీ

మెహిదీపట్నం, మార్చి 04, ప్రభాతవార్త : ధరావత్ ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని బిజెపి కార్వాన్ నియోజకవర్గ నాయకులు దేవర వంశీ డిమాండ్ చేశారు.మృత్యువుతో పోరాడి వరంగల్ ఎం.జి.ఎం ఆసుపత్రిలో కన్నుమూసిన మెడికో ధరావత్ ప్రీతి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ గుడిమల్కాపూర్‌లో డివిజన్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి శారదానగర్ వివేకానంద స్వామి విగ్రహం వరకు నిర్వహించిన క్యాండిల్ ర్యాలీలో దేవర వంశీ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రలను హోంమంత్రి గాలికి వదిలేయడంతోనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్నారు. ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నామ యాదగిరినేత, రాచకొండ శ్రీకాంత్ సాగర్, సుధాకర్ యాదవ్, ముఖేష్ సాగర్ పాల్గొన్నారు.

## పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

### డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, మార్చి 4 ప్రభాతవార్త: నియోజక వర్గంలో ఎక్కడ కూడా పారిశుద్య సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గంలోని ఐదు డివిజన్లలో పనిచేసే సానిటేషన్ సిబ్బందితో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి మాట్లాడారు. బస్తీల్లో, స్కూల్స్, రద్దీగా ఉండే జనసము దాయాల వద్ద సానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిం చాలని సూచించారు.

## విద్యుత్ ఘాతంతో నలుగురికి గాయాలు

పేట్‌బషీరాబాద్,మార్చి4 ప్రభాతవార్త: గాలికి ఎగురుతున్న ఫ్లెక్సీని సరిచేస్తున్న క్రమంలో నలుగురు వ్యక్తులు విద్యుత్ ఘాతానికి గురైన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కొంపల్లి సినీప్లానెట్ ఎన్ సీఎల్ నార్త్ సర్వీస్ రోడ్డులో ఉన్న సాయి చైతన్య జూనియర్ కళాశాల సమీపంలోనే 11కేవీ విద్యుత్ తీగల స్తంభం ఉంది. కళాశాలకు చెందిన ఫ్లెక్సీ ఊడిపోయి గాలికి ఎగురుతుండడం గమనించిన సిబ్బంది విజయ్, ఉపేందర్, లక్ష్మణ్, కళాశాల భవనంపైన అద్దెకు ఉం టున్న కారు డ్రైవర్ క్రాంతి ఫ్లెక్సీని సరిచేస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా గాలి ఎక్కువ అవడంతో ఫ్లెక్సీ 11కేవీ విద్యుత్ తీగలకు తాకి ఫ్లెక్సీని సరిచేస్తున్న నలుగురికి విద్యుత్ షాక్ తగిలింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడగా డ్రైవర్ క్రాంతికి తీవ్ర గాయాలు అయ్యాయి. కళాశాల యాజమాన్యం వెంటనే స్పందించి బాధితులను సమీపంలోని హర్ష ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అయితే తీవ్ర గాయాలైన డ్రైవర్ క్రాంతికి వైద్యులు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారని కళాశాల డైరెక్టర్ కెవిఎల్ ఎన్‌రెడ్డి తెలిపారు.

## కుక్కలుతో జర భద్రం

### కార్పొరేటర్

అల్వాల్, మార్చి 4 ప్రభాతవార్త: కుక్కలు పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ కోరారు. శనివారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కుక్కలు పట్ల వ్యవహ రించాల్సిన తీరును జిహెచ్ఎంసి అధికారులు కార్పొరేటర్ వివరించారు. కుక్కలు ఆహారం తీసుకుం టున్న సందర్భం నిద్రస్తున్న సమయంలో వాటి వద్దకు వెళ్ళరాదని సబిత అనీల్ కిషోర్ కోరారు. వేగం గా నడవడం కళ్ళ లోకి చూడడం వంటివి చేయ రాద న్నారు. రాళ్ళు కర్రలు కుక్కలుపై విసిరితే దాడి చేసే ప్రమాదం ఉందన్నారు. కుక్క లు కరిచిన వెంటనే గాయమైన చోట పది నిమిషాలు పాటు సబ్బుతో కడిగిన తరు వాత వైద్యుడిని సం ప్రదించి టీకాలు తీసుకో వాలని కోరారు. అనీల్ కిషోర్ ప్రభాకర్ సంతోష్ స్వప్న ఉన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
EE, సర్కిల్-30, బేగంపేట, సికింద్రాబాద్ జోన్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటననెం. 45/EE-30/SDZ/GHMC/2022-23, తేది: 04.03.2023
వివరములను https://tender.telangana.gov.in పై చూడవచ్చును. ప్రాథమిక తేదీలు దిగువ విధంగా గలవు. పని పేరు: సికింద్రాబాద్ GHMC, SDZ, సర్కిల్-30, బేగంపేటలోని సికింద్రాబాద్ స్విమ్మింగ్‌పూల్ వద్ద స్విమ్మింగ్‌పూల్, వాష్‌రూమ్‌లు మరియు ఇతర ప్లంబింగ్ పనులకు మరమ్మతులు, 148-రాంగోపాల్‌పేట్, బేగంపేట సర్కిల్-30, SDZ, GHMC, సికింద్రాబాద్‌లో EE (లేక్స్), బుద్ధభవన్, మొదటి అంతస్తులో (నిర్వహణ) పనులు మరియు మిగులు పనులు, అంచనా విలువ రూ.లక్షలలో: 21.50, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది & సమయము/బిడ్ డాక్యుమెంట్ సమర్పణ ముగింపు తేది & సమయం: 06.03.2023న ఉ.11.00 గం.లు, 16.03.2023న ఉ.11.00 గం.లు అధికారి పేరు, చిరునామా & సెల్ నెం: EE, సర్కిల్-30, GHMC, సికింద్రాబాద్, సెల్ నెం.9849906750. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, సర్కిల్-30, బేగంపేట, సికింద్రాబాద్ జోన్, GHMC. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, సర్కిల్-30, బేగంపేట
DIPR.No.13038-PP/CL/Advt/1/2022-23, తేది: 04.03.2023



BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL - II,AT: TRIVENI COMPLEX, 1st FLOOR, ABIDS, HYDERABAD

OA NO 688 OF 2022.

Between:
UNION BANK OF INDIA
EX – CROPORATION BANK
(MADHAPUR BRANCH) ...APPLICANTS
AND
M/S AARTI ASSOCIATES ...DEFENDANTS
To,
1. M/S AARTI ASSOCIATES
#Plot No.355, Sy.No.52, Daimond Hills), Gachibowli, RR Dist, T.S-500032.
2.LEELA SUTHAR
W/o Late Sri Jitendra Suthar, Aged:43, Occ: Business,#3327, C-Block, Pranav Annapurna, Lotus Pond, Safari Hills, Kondapur,RRDist, T.S-500032
3.RAHUL SUTHAR
S/o Late Sri Jitendra Suthar, Aged:20 years, Occ: Business, #3327, C-Block, Pranav Annapurna Lotus Pond, Safari Hills, Kondapur,RRDist, T.S-500032.
4.VIJAY SUTHAR, S/o Jitendra Suthar Aged:19 years, Occ: Business, #3327, C-Block, Pranav Annapurna Lotus Pond, Safari Hills, Kondapur, RR Dist, T.S-500032.
5.MS. AARTI SUTHAR
D/o Late shri Jitendra Suthar Aged:18 years, Occ: Business, #3327, C-Block, Pranav Annapurna, Lotus Pond, Safari Hills, Kondapur, RR Dist, T.S-500032

Please take the summons in the above O.A. No.688/2022 filed by the applicant for recovery of money of Rs 46,32,923.07 PS against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" daily newspaper and posted the matter to 20/03/2023.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) to show cause within thirty days of the service of summons as to why relief rayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties;
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 20/03/2023 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Tate Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 04 day of March-2023.

(By order of the Court)
Signature of the Officer Authorised to issue Summons



**PUBLIC NOTICE**

This is to inform the General Public at large that our client **Sri. Praveen Kumar Yemula,** S/o. Yemula Prabhakar, aged about: 51 years, Occ: Private Employee, R/o. H.No. 1-12-93, LIG A-93, Dr. A.S. Rao Nagar, Kapra, ECIL Post, Medchal-Malkajigiri District-500062, Telangana State, is the owner of the house bearing No.1-12-93, LIG A-93, admeasuring 169.8 Sq.Yds or 142.00 Sq. Mtrs, in survey Nos. 461 to 469, Ward No.1, Block No. 12, situated at Dr. A.S. Rao Nagar, Kapra, Medchal-Malkajigiri District Telangana State.
Our client lost his original link document, relating to the above said property viz., Registered Sale dated 20-11-1979 executed by Electronics Corporation Employees Co-operative House Construction Society Limited in favour of Sri. Yemula Prabhakar, S/o. Yemula Ellaiah, vide Doc.No.2787 of 1979, registered in the O/o. SRO Medchal, while shifting his house from DAE Colony to A.S. Rao Nagar as such on 11-02-2023 he has also lodged a complaint with the Commissioner of Police RachaKonda.
In this connection, we request the general public that, in case if any one finds the above said original document, kindly return the same either to our client at his address mentioned above or at our office.
Further if any Person/s, Institution/s, Financial Institution/s, Bank/s etc., having any kind of right, title, interest, claim or objections of what so ever nature, in respect of the above said Property may contact the undersigned with written representation along with all the original documentary evidence within seven days, from the date of publication of this notice, failing which our client shall presume that there are no claims, objections, litigations of what so ever nature in respect of the above said property.

**S & H LAW ADVISORS,**
**B. HARINATH RAO,**
**N. SRIDEVI,**
**Advocates**
Flat No. 620, Gyandeep Towers, Moosarambagh, Opp. More Super Market, Malakpet, Hyderabad-500036 (TS),
**Mob. No. 9849888058, 040-24558058**



**CLASSIFIEDS** (వార్త VAARTHA CLASSIFIEDS)

**CHANGE OF NAME**

★ I **MOHAMMED MUZAMIL,** R/o. H.No.20-4-129/32/1, SHAH ALI BANDA, HAVELI MANJLI BEGUM, Hyd, T.S, Changed My Name As **MOHAMMED MUZZAMMIL S/o. MOHAMMED PASHA.**

★ I **MOHAMMED MUZAMEEL,** R/o. H.No.20-4-129/32/1, SHAH ALI BANDA, HAVELI MANJLI BEGUM, Hyd, T.S, Changed My Name As **MOHAMMED MUZZAMMIL S/o. MOHAMMED PASHA.**

★ **I NATTA SAVITHRI D/o.N.Seeta Rama Rao** R/o.H.No.152, Spring Woods, Praneeth Nagar, Shambhupur, Cyberabad, T.S, Changed My Name As **SHAMILY HARIDAS D/o.N.SEETA RAMA RAO.**
**(Ro.No. 061619)**

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



**IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL SENIOR CIVILJUDGE AT: MALKAJGIRI**
**I.A.NO.699 OF 2019**
**IN**
**O.S.NO.756 OF 2011**

**Between :**
Sri.G.R.Srinivas
**...Petitioner/Plaintiff**
**AND**
Smt.Gaddam Laxmi and Others
**...Respondents/Defendants**
B.Lingam
**...Proposed Defendant/Third Party**
To,
Sri. B.Lingam, S/o. B.Odeulu, Aged about 39 Years, Occ: Business, R/o.Plot No.3, 4,&5, Anjaiah Nagar, Old Bowenpally, Secunderabad.
Please take notice that the Petitioner/Plaintiff filed the above suit for Specific Performance of Agreement of Sale against the Gaddam Laxmi and others and while pending the suit the Petitioner/Plaintiff filed a petition Under Order 1 Rule 10 (2) of C.P.C. & Rule 28 of C.r.P R/w Sec.151 of C.P.C. to impleading you as Proposed Defendant in the above case. The above case is posted on 07-03-2023 for your appearance. Therefore, you may appear before the Hon'ble Court on 07.03.2023 at 10.30 A.M in person or through Advocate, failing which the matter will be decided ex-parte.
// By the Order of Hon'ble Court//
**T.RATHNAIAH,**
**A.RMESH, S.K.JAHANGEER,**
**M.ANUSHA, SAMEENA BANU &**
**P.RAJESH.**
Advocates
Rathnaiah & Associates
Advocates & Sollcitors
# 304, Haripriya Complex, 2nd Floor, Habsiguda "X"Road, Hyderabad-07. T.S.



**PUBLIC NOTICE**

My client, **P. Vinoda W/o. P. Venugopal,** aged about 52 years, Occ: Household, R/o. H.No.8-2-548, Road No.7, Near Meridian School, Banjarahills. Hyderabad- 500 034, absolute owner of House No. 8-2-558/4 (Old), 8-2-548/48/1 (New), admeasuring 110 Sq.yds., situated at Dood Khana Basti, Banjarahills, Hyderabad, Ward No.8, Block No.2, and bounded by North: House of Sri. N. Ramachandra Reddy; South: House of Sri. S. Narsimha Reddy; East: Road; West: House of Sri. A. Raj Reddy; as per Sale Deed Doc. No.2628/1996 dated 16.10.1998 and registered at R.O. Banjara hills having purchased from N.Narsimha Reddy. My client lost its link document Sale Deed Doc. No.20/1972 dated 05.01.1972 registered at SRO Khairatabad, purchased by N.Narsimha Reddy from S.Gouraiah, while travelling from Banjarahills to Secunderabad on 27.02.2023. Founder of above document may kindly handover to me.

**Sd/- DR.C.S.CHAKRAVARTHY**
**ADVOCATE**
H.No.16-11-16/T/4, "Masters Nilayam", West Prashanth Nagar, Moosarambagh, Hyderabad-500 036, Telngana State. **Cell No.9391046708, 40-35888927**



**IN THE COURT OF THE HON'BLE 2nd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT :: AT HYDERABAD**

**O. S. No: 1774 / 2019**
Between:
State Bank of India,
...Plaintiff
And
**Visweswar Rao Jaggumantri**
...Defendant
To, **Visweswar Rao Jaggumantri**, Aged Major, 7-1-307/12/4A, Subhash nagar, Near Santhoshima Temple, Hyderabad. ...Defendant.

**NOTICE**
Take notice that the plaintiff bank filed the above suit for recovery of amount against the defendant and the said suit is stands posted for your appearance on **20.03.2023.** Hence your are hereby directed to appear before the said court on **20.03.2023 at 10.30 AM** personally or through an advocate failing which the matter will be heard in your absence.
//By order of the Court //
**B. Sriram Kartik,**
**S Kishore**, Advocates,
Plot No.22, Sri Sai Nagar Colony, Road No.4, GSI Post, Hyderabad-500 068.








# ఎమ్మెల్యే మంచిరెడ్డి వ్యాఖ్యలను ఖండించిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పాలకవర్గం


సమావేశంలో పాల్గొన్న మున్సిపాలిటీ పాలకవర్గం

**తుర్కయంజాల్, మార్చి 4 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కుంటుపడిందన్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలను పాలకవర్గం ఖండించింది. శనివారం రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో చైర్ పర్సన్ అనురాధ రాంరెడ్డి, పాలక వర్గ సభ్యులు మాట్లాడుతూ తొర్రూరు ప్రగతి నివేదన సభలో చేతగాని పాలకవర్గమంటూ ఎమ్మెల్యే అనుచితవ్యాఖ్యలు చేశా రని వాపోయారు. మున్సిపల్ నిధులతోనే అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇప్పటివరకు ప్రభుత్వంనుంచి కానీ, ఎమ్మెల్యే నుంచికానీ చిల్లిగవ్వ రాలేదని తెలిపారు. మున్సిపల్ బిల్డింగ్, వెజ్ నాన్ వెజ్ బిల్డింగ్‌ల ఏర్పాటుకు వివాదాస్పద స్థలాలను ఎంపిక చేసి, మంత్రి కేటీఆర్‌తో ప్రారంభోత్సవాలు చేయిం చారని ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేద న్నారు. అలాగే తుర్కయంజాల్-నాదర్‌గుల్ రోడ్డు పనుల్లో నూ స్పష్టత లేదన్నారు. నాదర్‌గుల్‌లో అక్కడి ఎమ్మెల్యే పనులు ప్రారంభిస్తే... ఇక్కడ ఏ కారణం వల్ల వెనుకంజ వేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గానికి ఎమ్మెల్యే సహకరించి, అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, ఫ్లోర్ లీడర్ కొశికె ఐలయ్య, కౌన్సిలర్లు నక్క శివలింగం గౌడ్, కుంట ఉదయశ్రీ గోపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు గుండ్లపల్లి ధన్‌రాజ్, గౌతమ్‌రెడ్డి, రేవల్లె హరితాయాదగిరి, వంగేటి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రంలో, రాష్ట్రంలో దుర్మార్గపు పాలన : మల్‌రెడ్డి రాంరెడ్డి


చంపాపేటలో కరపత్రాన్ని అందజేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

**సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఎల్‌బినగర్ కాంగ్రెస్ ఇంఛార్జి మల్‌రెడ్డి రామ్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాచర్లపల్లి శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించిన అనంతర ం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కన్యా కుమారి నుంచి జమ్ము కాశ్మీర్ వరకు చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్ర స్ఫూర్తిగా తాము ఎల్‌బినగర్ నియోజకవర్గంలో యాత్రను చంపాపేట నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. యాత్రలోభాగంగా గుర్తించిన ప్రజాసమస్యలన్నింటిని తాము అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ, వృద్ధులకు రూ.5వేల పెన్షన్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీపై రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం, అర్హులైన వారికి జాగా ఉంటే ఇండ్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇవ్వడం జరుగుతుం దన్నారు. గత 9 సంవత్సరాలుగా కేంద్రంలో, రాష్ట్రంలో దురామ్మార్గపు పాలన నడుస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపిలను బొందపెట్టాలని ఆయన పిలుపునిచ్చా రు. ఈ కార్యక్రమంలో గురునాథ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రమేష్ నాయక్, యాదగిరి, సారయ్య, తోకటి కిరణ్, నారాయణ, శివ, చింటు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్ ద్వార విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయవచ్చు : పన్నాల


సైన్స్ ఫేర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పన్నాల, బిఎల్ఆర్

**నాచారం, మార్చి 4 ప్రభాతవార్త:** సైన్స్ ఫెయిర్ ద్వార విద్యా ర్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయవచ్చని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మల్లాపూర్ వెంకటరమణ కాలనీలోని శ్రీ చైతన్య ఎడ్యుకేషన్ సొసైటీ విజ్ఞాన భారతి హైస్కూల్ ల్లో నిర్వహించిన సైన్స్ ఫేయిర్‌ను వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. సైన్స్ పట్ల విద్యార్థులకు బాల్యం నుంచే విద్య, వైజ్ఞానికంపై టీచర్లు అవగాహణ కల్పించినప్పుడే వారు వినూత్నంగా ఆలోచనలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి కటార్ల భాస్కర్, స్కూల్ కరస్పాండెంట్ బుచ్చి రెడ్డితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## జోడో యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


బాలకృష్ణను సన్మానిస్తున్న మక్బూద్ అహ్మద్, బొల్లు కిషన్

**మలక్‌పేట, మార్చి 4 ప్రభాతవార్త:** మలక్‌పేట నియోజవక వర్గంలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిసిసి ప్రధానకార్యదర్శులు మక్బూద్ అహ్మద్, బొల్లు కిషన్ పేర్కొన్నారు. మలక్‌పేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మలక్‌పేటలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మాట్లాడు తూ కార్యక్రమాన్ని ఈ నెల 11వ తేదీన అక్బర్‌బాగ్ డివిజన్ లో సాయంత్రం అజంపుర డివిజన్‌లో మక్బూద్ అహ్మద్ నివాసంనుండి ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమంలో నా యకులు,కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

**జోడో యాత్ర ఇంఛార్జిగా బాలకృష్ణయాదవ్**

మలక్‌పేట నియోజవకవర్గం హాత్ సే హాత్ జోడో యాత్ర ఇంఛార్జిగా మాజీ చైర్మన్ జి.బాలకృష్ణయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని డివిజన్లలో ఈ జోడో యాత్ర కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్‌గౌడ్,చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చిగురు బాలరాజ్, గంట్ల కృష్ణ, కిషన్‌సింగ్, మదన్‌బాబు, చక్రం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత సాయిరాంగౌడ్‌కు సన్మానం


సాయిరాంగౌడ్‌కు సన్మానం చేస్తున్న నర్సింహారెడ్డి

**హయత్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** ముంబైలో జరిగిన గ్లోబల్ ఫేమ్ 2023 వారు నిర్వహించిన బెస్ట్ సోషల్ ఎంట్ర ప్రెన్యూర్ అవార్డు గ్రహీత వినాయక్‌నగర్‌కు చెందిన సాయి రాంగౌడ్‌ను మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ప్రత్యేక నైపుణ్యం దాగి ఉంటుందని, దానిని వెలికితీసి సమాజానికి ఉపయోగ పడేలా చూసుకోవాలన్నారు. ప్రతి పనిని ప్రణాళిక బద్ధంగా చేయడంద్వారా ఎంతటి విజయాన్ని అయినా అందుకోవచ్చ న్నారు. అవార్డు గ్రహీత సాయిరాంగౌడ్ మాట్లాడుతూ... జీఎఫ్ఏ బెస్ట్‌సోషల్ ఎంట్రప్రెన్యూర్ అవార్డును రియల్‌హీరో సోనుసుద్ చేతుల మీదుగా అవార్డును అందుకోవడం ఆనం దంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి యాదగిరి, నవీణ్‌గుప్త, జయతేజ, రోహిత్‌రెడ్డి, పారందసాయి, రవితేజ, శివకుమార్ పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో జాతీయ భద్రతా దినోత్సవ వేడుకలు



జాతీయ భద్రతా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ఎసిపి శ్రీనివాస్, సిఐ పార్థసారథి, మక్బూల్‌జానీ, డిఎస్ఎల్ కృష్ణ

**ఉప్పల్, మార్చి 4 ప్రభాతవార్త :** జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా ఉప్పల్‌లోని డిఎస్ఎల్ వర్చువల్ మాల్, రాచ కొండ ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్లు పార్థసారథి, మక్బూల్ జానీ, ఎస్ఐ చిరంజీవి, డిఎస్ఎల్ మాల్ నిర్వాహకులు కృష్ణ, ఎ.రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎసిపి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఉప్పల్‌లోని ప్రసిద్ధ డిఎస్ఎల్ వర్చువల్ మాల్ సంస్థ రోడ్డు భద్రత గురించి వాహనదారు లకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్ట డం అభినందనీయమన్నారు. వాహనదారులు రోడ్డు ప్రమా దాలపై అవగాహన పెంచుకోవాలని, ప్రమాదాలు జరుగకుం డా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎస్ఐ రాజు, షీ టీమ్ పోలీసుల ఆధ్వర్యంలో మహిళలకు సెఫ్టీ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఆటో యూనియన్ నేతలతోపాటు, పలువురు వాహ నదారులు, డిఎస్ఎల్ వర్చువల్ మాల్ ఉద్యోగులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : చౌకి రవికుమార్

**మలక్‌పేట, మార్చి 4 ప్రభాతవార్త:** ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్‌పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, బిజెపి గ్రేటర్ కార్యదర్శి చీపురు రాజారావుగౌడ్ లు పేర్కొన్నారు. జైన్ సమాజం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ పరమాత్ముడి విగ్రహాని న్ భక్తి శ్రద్దలతో మేళతాళాల మధ్య ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో సుదీక్‌జైన్, వినయ్ జైన్, రవీందర్ జైన్, ఎల్ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జంటవిగ్రహాల ఆవిష్కరణ పోస్టర్ విడుదల

**హయత్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మహాత్మజ్యోతిభా సావిత్రిబాయి పూలే జంట విగ్రహాలను ఈనెల 18న ఆవిష్కరించ నున్నారు. ఈమేరకు జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరే టర్ కొప్పుల నర్సింహారెడ్డి, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డిలు శనివారం జంటవిగ్రహాల ఆవిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను హయత్‌నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు పారందస్వామి, ఎర్రరవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ ఒలంపియాడ్‌లో సైన్స్ ఫెయిర్

**సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నారాయణ ఒలంపియాడ్ పాఠశాలలో శని వారం సైన్స్ ఫెయిర్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు తెలుగు, హిందీ సాహిత్యాలు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్‌లకు సంబంధించిన అంశాలను ప్రదర్శించారు. ఈ ఫెయిర్‌ను తిలకించిన డిజిఎం గోపాల్‌రెడ్డి, ఎంజిఎం రవీందర్‌బాబు,ప్రిన్సిపాల్ బాబ్జిలు విద్యార్థులప్రతిభను ప్రశం సించారు. ఈ కార్యక్రమంలో ఈ చామ్స్ వైస్ ప్రిన్సిపాల్ ధరణి, ఇ-కిడ్ వైస్ ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఎన్‌డిపి పనులకు అవసరమైన స్థల పరిశీలన

**సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** హస్తినాపురం డివిజన్ భీమానగర్ నుంచి హుడా భారతి కాలనీవరకు ఎస్ఎన్‌డిపి పనులు చేపట్టడానికి అవసరమైన స్థల సేకరణ కోసం కార్పొ రేటర్ సుజాత నాయక్ శనివార ం అధికారులు, స్థల యజ మానులతో కలసి పర్యటించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సహ కారంతో జోనల్ కమీషనర్ పంకజ సదరు స్థల యజమా నులతో ఫోన్‌లో మాట్లాడడం జరిగిందని, వారు అంగీకారం తెలపడంతో ఎస్ఎన్‌డిపి పనులు చేపట్టడానికి కావాల్సిన స్థలాన్ని పరిశీలించడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు. ఎస్ఎన్‌డిపి పనులు పూర్తయితే చాలా కాలనీలకు వరదనీటి ఇబ్బందులు తొలగిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రసాద్, ఇఇ కృష్ణయ్య, డిఇ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జీవో 59 సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి విజ్ఞప్తి


కలెక్టర్ వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 4 ప్రభాతవార్త :** జీవో నెంబర్ 59 సమ స్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్‌కు విజ్ఞప్తి చేశారు. జీవో 59సమస్యకు సంబం ధించి శనివారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ హరీష్‌ను కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని హస్తినాపురం, బియన్‌రెడ్డినగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, నాగోల్, చంపాపేట్ డివిజన్లో 59జీవో కారణంగా వస్తున్న అధిక బిల్లుల పట్ల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. కొన్ని బస్తీల్లో సుమారు 100గజాలకు రూ.3లక్షలు, రూ.4లక్షలు, కొంద రికి రూ.10లక్షలనుంచి రూ.20 లక్షలు బిల్లులు వస్తున్నా యని తెలిపారు. వరుస క్రమంలో ఉన్న ఇళ్లకు ఒక్కొక్కరికి లక్షల చొప్పున బిల్లులు వచ్చాయన్నారు. వీటన్నిటిని పరిగణ లోనికి తీసుకొని ఆయా వివరాలను కలెక్టర్కు వివరించడం జరిగిందన్నారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ బిల్లులపై పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, పలు కాలనీవాసులు పాల్గొన్నారు.

## వీది కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి : కార్పొరేటర్ అరుణ


ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 4 ప్రభాతవార్త:** సైదాబాద్‌డివిజన్ శంకేశ్వర్ బజార్‌లోని ప్రభుత్వపాఠశాల విద్యార్థులకు కుక్కల విషయం లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, డిసి జయంత్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వీదికుక్కల సంచారం ఎక్కువగా ఉన్న చోట విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వీది కుక్కలపై రాళ్లు, ఇతర వస్తువులు విసిరివేయవద్దని, పిల్లలు ఉన్న కుక్క దగ్గరకు వెళ్లరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరి అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, డాక్టర్ రాంచంద్రారెడ్డి, హెచ్ఎం రేణుక తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి కృషి : ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ నారాయణరెడ్డి తదితరులు

**మలక్‌పేట, మార్చి 4 ప్రభాతవార్త:** విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్స్ 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డే కార్యక్రమా న్ని దిల్‌సుక్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశ ఎంతో కీలకమైనదని విద్యార్థులు ఏకాగ్రత, పట్టు దలతో చదివి తమ లక్ష్యసాధనకోసం కృషి చేయాలన్నారు. పోటీ యుగంలో విద్యార్థులు అన్ని అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థాయిలో ఉన్నారని వివరిం చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృ తిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ ఇందిర, ప్రిన్సిపల్ మధురవేణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాధ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద వధువులకు అండ : ఉప్పల

**ఎల్.బి.నగర్, మార్చి 4 ప్రభాతవార్త :** నిరుపేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ అండగా నిలుస్తుందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు వధువుల పెళ్లిళ్లకు అవసరమైన మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరా ళంగా అందజేశారు. రసూల్‌పురాకు చెందిన దీపిక, జహీరా బాద్‌కి చెందిన వైష్ణవి వివాహం శ్రీనివాస్‌గుప్త చేతుల మీదు గా మంగళసూత్రం, మెట్టెలు,చీర, గాజులు, 100 కేజీల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వధువుల తల్లిదండ్రులు, బిజెపి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి

**నేరెడ్‌మెట్, మార్చి 4 ప్రభాతవార్త:** రాజ్యాంగంలో మహిళా హక్కులపై పొందుపరచిన చట్టాలను మహిళలు, యువతు లు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం నేరెడ్‌మెట్ వాజ్‌పేయినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాజ్యాంగంలో మహిళల కోసం రూపొందించిన చట్టాలపై మహిళలు అవగాహన పొందాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి కఠినమైన చట్టాలు రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు సివిల్ జడ్జి విక్రమ్, అరుణ్ తేజ్ దిలీప్, పూజ శ్రీదేవి, మల్లిక, డాక్టర్ రమేష్, బ్రిజేష్, సంగీ రమేష్, వినోద్, రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తనకు సమాచారం లేకుండానే డివిజన్‌లో కాలేజీ నిర్మాణపు పనులా? : కార్పొరేటర్ బిక్షపతిచారి


పనులు పరిశీలించి విస్మయం వ్యక్తం చేస్తున్న బిక్షపతిచారి

**సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** తన డివిజన్‌లో తనకు సమాచారం లేకుండానే సిర్లాహిల్స్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జూనియర్ కాలేజీ నిర్మాణపు పనులను ప్రారం భించడంపై మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం సంబంధితవిద్యాశాఖ అధికారులను కలిసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో తన అభ్యర్థన మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఇక్కడి ప్రాథమిక పాఠశాల ను అభివృద్ధి చేసి అదనపు తరగతి గదులను నిర్మిస్తామని హామీనిచ్చారని ఆయన గుర్తు చేశారు. అయితే జిల్లెలగూడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో జూనియర్ కాలేజీ నిర్మాణం కొరకు మీర్‌పేట్ మేయర్, డిప్యూటీ మేయర్లు శంకుస్థాపన చేస్తే ఉన్నఫలంగా అక్కడ నిర్మించాల్సిన కాలేజీని తన డివి జన్‌లోని ప్రభుత్వ ప్రాథమికపాఠశాల స్థలంలో నిర్మించడానికి పనులు ప్రారంభించడం విస్మయానికి గురి చేసిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల స్థలంలో పోలీస్ స్టేషన్, అంగన్ వాడి భవనం/ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారనీ దీనికి తోడు జూనియర్ కాలేజీ కూడా నిర్మిస్తే ఇక్కడి ఇరుకైన కాలనీ రహదారిలో ఇబ్బందులు కలుగుతాయని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలోని స్థలం జూనియర్ కాలేజీకి సరిపోనందును వేరే చోటుకి మార్చి ప్రాథమిక పాఠశాలను పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేసి విశాలమైన తరగతి గదులను నిర్మించాల ని ఆయన కోరారు. కాగా డివిజన్‌లోని తిరుమలహిల్స్, సిర్లా హిల్స్ కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు కూడా కాలేజీ నిర్మాణంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ విద్యాశాఖ అధికారుల కు వినతి పత్రాలు సమర్పించారు.

## ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమాలు విజయవంతం: అందెల


కేంద్ర సంక్షేమ పథకాల నమోదు కార్యక్రమంలో పాల్గొన్న అందెల

**సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజక వర్గంలో బిజెపి ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమాలు విజయవంతమయ్యాయని నియోజక వర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. శనివారం ఆయన నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాల నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి చేపట్టిన ప్రజా గోస బిజెపి భరోసా కార్యక్రమాలకు ప్రజల నుండి మంచి స్పందన లభించిందని తెలిపారు.ఈ కార్యక్రమాల సందర్భం గా ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు పాలకుల పై ఒత్తిడి తెస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమా ల్లో బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దడిగ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న కూచిపూడి నాట్య ప్రదర్శనలు


మినీ శిల్పారామంలో కళాకారుల కూచిపూడి నాట్యప్రదర్శనలు

**ఉప్పల్, మార్చి 4 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రమణి సిద్ది ఆధ్వర్యంలో నెల నెలా కళారాధనలో స్వరాయల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ గురువు పద్మావతి శిష్య బృందంచే కర్ణాటక గాత్రకచేరీ, అన్నచాచార్యా సంకీర్తనలు ఆలపించారు. రాజే శ్వరి శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిం చారు. ఈ సందర్భంగా తాండవ నృత్యకారి, ఆడెను శివుడు, బాలగోపాలా తరంగం, తక్కువేమి మనకు, కులుకాగా దుర్గే, నదవరో, అందుకో రావయ్య, హిందువుల తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. బడంగ్‌పేట మేయర్ పారిజాత నరసింహారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని సంగీత గురువు పెనుమూడి పద్మజశర్మ, ఇతర కళాకారులను సత్కరించారు.

## కార్పొరేషన్ కార్మికుల పక్షాన పోరాడుతాం: సిఐటియు దాసరి బాబు

**సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** కార్మికుల హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతామని సిఐటి యు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి బాబు అన్నారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిటీ సర్వసభ్య సమావేశం శనివా రం మీర్‌పేట్‌లో బాబు అధ్యతక్షన జరిగింది. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ కార్మికులకు ఐడి కార్డులు, ఐఎస్ఐ కార్డులు ఇవ్వాలని, యూనిఫారాల కుట్టు కూలీకి సంబంధించి న్యాయమైన రేటు ఇవ్వాలని, కార్మికు లందరికీ నిత్యావసరాలు ఇవ్వాలని కమీషనర్‌ను కోరారు. కాగా ఈ సమావేశంలో కమిటీ నూతన అధ్యక్షునిగా సిహెచ్ యాదగిరి, కార్యదర్శిగా బోడ నర్సింహ, కోశాధికారిగా భారతమ్మ, కార్యవర్గ సభ్యులుగా పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పెంటయ్య, ప్రజా సంఘాల నేత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు కాలనీ సంఘాల సమాఖ్య ప్రథమ సర్వ సభ్య సమావేశం

**సరూర్‌నగర్, మార్చి 4 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కుసంబంధించిన కాలనీ సంక్షేమ సంఘాల సమా ఖ్య ప్రథమ సర్వ సభ్య సమావేశం ఆదివారం కర్మన్‌ఘాట్ రింగ్ రోడ్డులోని వంగ శంకరమ్మ గార్డెన్స్‌లో జరుగుతుందని సమాఖ్య ప్రతినిధులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు నర్సిం హారెడ్డిలు తెలిపారు. శనివారం జిల్లెలగూడలో ఏర్పాటు చేసి న సమావేశంలో వారు మాట్లాడుతూ కాలనీల్లో సమస్యల పరిష్కారం, వసతుల కల్పన, ప్రజా సంక్షేమం కోసం సమా ఖ్యను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేప థ్యంలో ఆదివారం జరిగే సమావేశానికి ముఖ్యఅతిథిగా మం త్రి పి.సబితాఇంద్రారెడ్డి హాజరవుతున్నారని వారు తెలి పారు. ఈ మేరకు కాలనీ సంక్షేమ సంఘాల వారు, కాలనీల వాసులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## యాప్రాల్‌లో జోడో అభియాన్ యాత్ర

**నేరెడ్‌మెట్, మార్చి 4 ప్రభాతవార్త:** మల్కాజిగిరిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని మల్కాజిగిరి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం నేరెడ్‌మెట్‌డివిజన్ పరిధిలోని యాప్రాల్, భూపేష్ నగర్, భగత్‌సింగ్ నగర్, మీదిబస్తి తదతర ప్రాంతాల్లో హాత్ సే జోడో అభియాన్ యాత్రలో భాగంగా పాదయాత్ర నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలముందు ఇచ్చిన హామీలను పూర్తి చేయ డంలో విఫలం చెందిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, నర్సింహ్మా, రాజలింగం, అశోక్, రమేష్, పాండు, ప్రేమ్‌కుమార్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, చాకో, శ్రీనివాసులు,పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హబ్సిగూడలో జోడో యాత్రకు స్పందన


జోడో యాత్రలో పాల్గొన్న ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నేతలు

**ఉప్పల్, మార్చి 4 ప్రభాతవార్త :** ప్రధాని మోడీ, సిఎం కెసిఆర్ కుమ్మక్కుతోనే గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతున్నారని కాం గ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు హబ్సిగూడ డివిజన్‌లోని శ్రీనివాస పురం, నవరంగ్‌గూడ, వెంకట్‌రెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుడు కాలేరు జైనవీన్ ఆధ్వర్యంలో జోడో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం తీవ్రతరం చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రతినిధులు మేకల శివారెడ్డి, ఎం.డి.తౌఫిక్, పిసిసి కార్యదర్శి పసుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కంది ఆగిరెడ్డి, మర్రి రంజిత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బోరంపేట కృష్ణ, తవిడబోయిన గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ నేతలు చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, తెల్కల మోహన్‌రెడ్డి, సుర్వి మురళీగౌడ్, ప్యాట మురళీ, రాము చౌదరి, ఆకిటి ఆగంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్‌దే: దేప


కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దేప

**ఎల్.బి.నగర్, మార్చి 4 ప్రభాతవార్త :** దేశాన్ని రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిచేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుం దని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివి జన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేకత గురించి ఈ సందర్భంగా దేప భాస్కర్‌రెడ్డి నేతృ త్వంలో సిపిఎంపార్టీకి చెందిన యాదమ్మ, రుఖ్య, లింగమ్మ, మాణిక్యమ్మ, నాగేశ్వరి, రోజా, వరలక్ష్మి, ధనమ్మ, ఎల్లమ్మ, సోనీ, సీతమ్మ, జ్యోతీ, కౌసల్య పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరగా వారికి భాస్కర్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా అనేక ప్రజా సం క్షేమ పథకాలు ప్రవేశపెట్టి బడుగు బలహీన వర్గాల అభ్యు న్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కృషిచేసిందన్నారు. రానున్న ఎన్నికలలో బిజెపి, బీఆర్ఎస్ పార్టీలను తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీని బలపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బంగారి బాబు, సామిడి గోపాల్‌రెడ్డి, ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, బండి మధు, నల్లెంకి ధనరాజ్ గౌడ్, మహమ్మద్ గుల్షన్, ధరావత్‌స్వామినాయక్, ఇమ్రాన్ ,తాంద్ర భాస్కర్, కల్యాణ్‌యాదవ్, అఫ్జల్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి : ప్రేమ్‌కుమార్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, మార్చి 4 ప్రభాతవార్త:** అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లో రూ. 45 లక్షల అంచనా వ్యయంతో కొనసా గుతున్న రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీ లించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృ ద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయా నికి పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజిని కాంత్, సత్యనారాయణ, కాలనీవాసులు శ్రీమన్నారాయణ, భాస్కర్‌రావు, సోమేశ్వర్ రావు, వెంకట్‌రమణ, రమణరావు, రవిబాబు, నవీన్ తదిత రులు పాల్గొన్నారు

**గౌతమ్‌నగర్ పరిధిలో...** ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు గౌతమ్‌నగర్ పరిధిలోని వాణినగర్‌లో 20 లక్షలతో కమ్యూనిటీ హాల్ పనులను కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ ఏఈ దివ్య జ్యోతితో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ కమ్యూ నిటీ హాల్ పనులు పూర్తి అయ్యాయని త్వరలోనే ఎమ్మెల్యే హన్మంతరావుతో కలిసి ప్రారంభిస్తామని తెలిపారు. డివిజన్ లో పెండింగ్ ఉన్న పనులను ఎమ్మెల్యే సహకారంతో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, ఇతర నాయకులు, కార్య కర్తలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.